పైసా పైసా కూడబెడ్తే..

కబ్జాలు చేస్తుండ్రు

101 ప్లాట్ల కబ్జాకు యత్నం

- 40 మంది బౌన్సర్లతో స్వైర విహారం
- కబ్జాదారుల వెనుక నల్గొండ బ్రదర్స్
- రిజిస్టర్డ్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా.. ఫేక్ డాక్యుమెంట్స్
- ప్రాణహాని ఉంది.. కాపాడండి
- మీడియా ముందు బాధితుల ఆవేదన

“ఇష్టమైన తిండి తినక మనసు సంపుకొని పైసా పైసా కూడబెట్టి జీవితంలో ఒక ఇల్లు కట్టుకోవాలె, కొన్నేండ్ల కలను సాకారం చేసుకోవాలె అని శక్తి కొద్ది స్థలాలను కొనుక్కుంటే.. రాజకీయ రాబందులు, అధికార దర్పంతో కబ్జాలకు పాల్పడుతున్నరు. పాలనా యంత్రాంగం అంతా తమవైపే ఉందంటూ బెదిరింపులకు పాల్పడి, లక్షలాది రూపాయలు పోసి కొన్న ఇండ్ల జాగలను, అమాయకులను దోపిడీ చేసి, దోచుకుపోయేందుకు కుయుక్తులు పన్నుతున్నరు. అయ్యో.. రామచంద్రా! ఇదెక్కడి న్యాయం? అని ఎవరికైనా చెబుదామంటే.. పాలకుల మద్దతు వారికి మెండుగ ఉన్నట్టు, వాళ్లే రాజకీయ పలుకుబడి వాళ్లకే ఉన్నట్టు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నారు. సాధారణ ప్రజలను మోసం చేస్తూ వారు అహర్నిశలు శ్రమించి కూడబెట్టుకున్న భూములపై కబ్జాకారులు వాలిపోతున్నారు.”

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్వీ రావు

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): పైసా పైసా కూడబెట్టి ఇంటి జాగా కొనుక్కొని ఇళ్లు కట్టుకుందామనుకుంటే భూ రాబందులు కబ్జా పర్వాన్ని మొదలు పెట్టారు. రిజిస్ట్రై.. ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ సొంత స్థలంలోకి వెళ్లాలంటే జంకుతున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులు, సోమలింగేశ్వర నగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.చెంచల్ రావు, ఎంవీ రావులు వివరాలను వెల్లడించారు. 1983 నుంచి 1987 మధ్య రంగారెడ్డి జిల్లా బాగ్ హయాత్‌నగర్‌లో సర్వే నం.180, 187లలో పట్టాదార్లు జల్లా బిక్షమయ్య ఆయన కుమారుడు జల్లా అచ్చిలింగం నుంచి సుమారు 101 ప్లాట్లను రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ ద్వారా కొనుగోలు చేసినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన వారిమి అంతా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులమేనని, జీహెచ్‌ఎంసీకి ల్యాండ్ ట్యాక్స్ సైతం చెల్లిస్తున్నామని, కొందరు ఇండ్లు కట్టుకొని వాటికి సైతం పన్నులు కడుతున్నట్టు పేర్కొన్నారు. 14 ఏండ్ల తర్వాత ప్లాట్ల ధరలు పెరగడంతో 1997లో బిక్షమయ్య వారసులమని చెప్పుకొని కొందరు ఈ ప్లాట్లపై తమకు హక్కు ఉందని, రిజిస్టర్డ్ ప్లాట్లను వ్యవసాయ భూమిగా తప్పుడు రికార్డులు సృష్టించారని, తమపై కోర్టులో కేసులు సైతం పెట్టారు. చివరకు రంగారెడ్డి జిల్లా కొత్తపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వి.సురేందర్ రెడ్డికి విక్రయించారన్నారు. ఈ ఏడాది ఆగస్టు 30న, సెప్టెంబర్ 23న తమ స్థలాలపైకి వచ్చి ఇండ్లను ధ్వంసం చేశారని, అడ్డువచ్చిన వారిపై దాడులు, దౌర్జన్యాలు చేశారు. తమ స్థలాల్లోకి వెళ్లకుండా సుమారు 40 మంది బౌన్సర్లను కాపలాగా ఉంచారన్నారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, పట్టించుకోవడం లేదన్నారు. కబ్జాదారులతో తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కోర్టులు డిస్మిస్ చేసినా..

తమ ప్లాట్లను స్వాధీనం చేసుకునేందుకు దొంగ పత్రాలతో హయాత్‌నగర్, రంగారెడ్డి, హైకోర్టు, సుప్రీం కోర్టు వరకు వెళ్లారని, కానీ, ప్లాట్ల నిజమైన యజమానులు తామేనని గుర్తించిన ఆయా కోర్టులు కేసును డిస్మిస్ చేశాయన్నారు. హైకోర్టుతో పాటు భారత అత్యున్నత న్యాయ స్థానం సైతం కేసును డిస్మిస్ చేసినా కబ్జాదారులు తమ స్థలాలను వదిలిపెట్టడం లేదని బాధితులు వాపోతున్నారు. వి.సురేందర్ రెడ్డికి రాజకీయ పలుకుబడి ఉండటంతో పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

చక్రం తిప్పుతున్న నల్గొండ బ్రదర్స్

కోర్టు కేసులు ఉన్న సమయంలోనే వి.సురేందర్ రెడ్డి తమ ప్లాట్లను కబ్జా చేశాడని, రాజకీయ పలుకుబడి ఉండటంతో ఎవరూ ఏమి చేయలేకపోతున్నారన్నారు. ఈ కబ్జాదారుడికి ఓ మంత్రి, అతని సోదరుడైన ఎమ్మెల్యే హస్తం ఉందని ఆరోపించారు. వారి అండదండలు చూసుకొని దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వాపోయారు. సదరు కబ్జాదారుడిపై మలక్‌పేట్, ఘట్‌కేసర్, దేవరకొండ, హయాత్‌నగర్, కీసర, మలక్‌పేట, మేడిపల్లి, ఎల్‌బీ నగర్‌లో రెండు, హయాత్‌నగర్‌లో మూడు కేసులు నమోదైనప్పటికీ పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

కట్టుకున్న ఇంటిని కూల్చివేశారు

1985 సంవత్సరంలో ఇక్కడ ప్లాట్ నంబర్ 30ని కొనుగోలు చేశాం. ఇటీవల ఓ చిన్న ఇంటిని కట్టుకొని అందులో నివాసం ఉండే ప్రయత్నం చేస్తుండగా, కట్టుకున్న ఇంటిని కూల్చివేశారు. కొందరు కబ్జాదారులు గూండాలను తీసుకువచ్చి మాపై దాడులు చేయించారు.

– సుధారాణి, న్యాయవాది;

క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నా..

బాగ్ హయాత్‌నగర్‌లో మాకు ప్లాట్ నంబర్ 12, 13లలో 300 గజాల చొప్పున ఇంటి స్థలం ఉంది. దీనిపై కొన్నేండ్లు జీహెచ్‌ఎంసీకి పన్నులు సైతం చెల్లిస్తున్నా.. బలవంతంగా స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు పోలీసు స్టేషన్‌కు వెళ్లినా తమకు న్యాయం జరుగడం లేదు.

– ఎం. ఉమాకాంత్ బాధితుడు;

టీ హబ్‌లో సినీప్రెన్యూర్

మీడియా, ఎంటర్‌టైయిన్ రంగాల్లో అవకాశాలకు శిక్షణ

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): సినిమా, మీడియా రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు టీ హబ్ ఆధ్వర్యంలో సినీప్రెన్యూర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మీడియా, ఎంటర్‌టైయిన్‌మెంట్ రంగాల్లో స్థిరపడాలన్న ఆసక్తి ఉన్న వారికి ఆ రంగానికి చెందిన నిపుణులు టీ హబ్‌లో నిర్వహిస్తున్న మీస్కూలు సంస్థ సినీ ప్రెన్యూర్ కార్యక్రమం ఉంటుందని, మరిన్ని వివరాలకు ఈ క్రింది లింకు (https://bit.ly/48iBKAW) లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 24 నుంచి శిక్షణ కార్యక్రమం మొదలవుతుందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎస్‌బీలో ఉచిత శిక్షణ

నేడు టాప్-10 అభ్యర్థులకు బహుమతుల ప్రదానం

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: సివిల్స్ తమ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంత యువతీ, యువకులను ప్రోత్సహించేందుకు ఉచిత శిక్షణ నిచ్చేందుకు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించిందని సంస్థ నిర్వాహకురాలు బాలలత తెలిపారు. టైలరో, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో కల్పతరు సాల్కర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 వేల మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 4వేల మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చిన టాప్-10 విద్యార్థులకు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో ఉచితంగా సివిల్స్ కోచింగ్‌తో పాటు టాప్-200లో వచ్చిన వారికి ఉచితంగా సివిల్స్ మెటీరియల్స్‌ను బహుమతిగా ఇస్తున్నామని తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆదివారం నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ కార్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు ఉంటుందని ఆమె తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ముఖ్య అతిథిగా వస్తున్నారని సీఎస్‌బీ అకాడమీ నిర్వాహకురాలు బాలలత తెలిపారు. ఈ కార్యక్రమం గాంధీనగర్‌లోని తమ అకాడమీలో జరుగుతుందని ఆమె చెప్పారు.

ప్రేమ పేరుతో యువతికి వేధింపులు

కోచింగ్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్, నవంబర్ 9: పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కుమార్తెను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. తనను ప్రేమించాలంటూ తన వద్ద పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునేందుకు వచ్చిన యువతిని వేధింపులకు గురి చేశాడు. మూడేండ్లుగా ఓపిక పట్టిన ఆ యువతి.. వేధింపులు ఎక్కువ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నాడు. అయితే తన కుమార్తె(21)ను ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కరణ్ సింగ్(26) వద్ద మూడేండ్ల కిందట పోటీ పరీక్షల కోసం కోచింగ్ సెంటర్‌లో చేర్చారు. పాఠాలు చెప్పి పోటీ పరీక్షలకు యువతిని ప్రిపేర్ చేయాల్సిన కరణ్ సింగ్ ఆ యువతిపై కన్నేసి వేధింపులకు గురిచేశాడు. విసుగు చెందిన ఆ యువతి 2021లో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. క్షమించాలని కరణ్‌సింగ్ ప్రాధేయపడటంతో.. పెద్దల సమక్షంలో కేసు రాజీ కుదుర్చుకున్నారు. మళ్లీ గత ఏప్రిల్‌లో యువతిని వెంబడిస్తూ.. వేధింపులకు గురి చేయడంతో తిరిగి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మళ్లీ ఈనెల 4వ తేదీన మధురానగర్ మెట్రోస్టేషన్ వద్ద నుంచి వస్తున్న ఆ యువతిని దారిలో అడ్డగించి మద్యం మత్తులో ఉన్న కరణ్‌సింగ్ బెదిరించాడు. దీంతో బాధితురాలి తండ్రి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నా భర్త, కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉంది

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు: రచనా రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న రచనా రెడ్డి

ఖైరతాబాద్, నవంబర్ 9: తన భర్త, ఆయన కుటుంబసభ్యులతో తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని గ్రీన్ పార్క్, ఆవాస హోటల్స్ డైరెక్టర్ ఆదాల దామోదర్‌రెడ్డి భార్య రచనా రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022 డిసెంబర్ 4వ తేదీన ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఆదాల దామోదర్ రెడ్డితో తనకు వివాహం జరిగిందని, కొన్ని నెలలపాటు అన్యోన్యంగా ఉన్నామని, కాని అత్త గుంపాటి పార్వతి ఆమె కొడుకును తాను దూరం చేస్తున్నానంటూ వేధింపులకు గురిచేసిందన్నారు. అదే అదునుగా చేసుకొని ఆమె దగ్గరి బంధువు, గ్రీన్ పార్క్, ఆవాస హోటల్స్ సీఈవో గౌతమ్ రెడ్డి జోక్యం చేసుకొని తనను ఇంటి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు ప్రారంభించాడన్నారు. అదే క్రమంలో తన భర్త కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేశాడని, దీంతో తాను సైతం వారిపై గృహ హింస కేసు పెట్టానని చెప్పారు. ఈనెల 6న తన భర్త ఇంటికి బట్టలు తెచ్చుకునేందుకు వెళ్లగా, తనపై బౌన్సర్లతో దాడి చేయించారని, తన రెండు మొబైల్ ఫోన్లు లాక్కున్నారని, అంతేకాకుండా తనను కారులో బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, తాను కేకలు వేశానని, చుట్టుపక్కల వారు రావడంతో వారు పారిపోయారన్నారు. వారి చేతిలో గాయపడి ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స తీసుకున్నానని, ఆ తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశానని, కాని ఇప్పటి వరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. తనపై జరిగిన దౌర్జన్యం, దాడికి సంబంధించిన వివరాలన్నీ ఆ ఫోన్లలోనే ఉన్నాయని, అందులోని వివరాలను ఐ క్లౌడ్‌ను హ్యాక్ చేసి ధ్వంసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పోలీసులు తనకు ఫోన్లు ఇప్పించాలని కోరారు. భర్త, అత్త, వారి సమీప బంధువు గౌతమ్ రెడ్డితో తన తల్లిదండ్రులు, చెల్లెళ్లకు ప్రాణహానీ ఉందన్నారు. పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేయాలని, లేని పక్షంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన దీక్ష చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

విద్యుత్ కోతలు.. తెలుగు వర్సిటీలో అంతరాయం

- నృత్యభారతి సంస్థ నిర్వాహకులు, కళాకారుల అసహనం
- పర్యవేక్షణాలోపం కారణంగా పనిచేయని జనరేటర్

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 9: నిత్యం సంగీత, సాహిత్య, నృత్య కార్యక్రమాలతో పాటు పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవాలు, సదస్సులు ఇతర కార్యక్రమాలతో నిత్యం సందడిగా ఉంటున్న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో విద్యుత్ అంతరాయంతో నిర్వాహకులు అసహనానికి గురవుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నగరంలో కరెంట్ కోతలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్న విషయం తెలిసిందే. కళా వేదికలకు విద్యుత్ అంతరాయం లేకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు వేళాపాలా లేకుండా కోతల వైపే మొగ్గు చూపుతుండగా, అందుకు అనుగుణంగా ముందు జాగ్రత్తగా జనరేటర్లు ఏర్పాటు చేసి కండీషన్‌లో ఉంచుకోవలసిన తెలుగు యూనివర్సిటీ యాజమాన్యం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. ఇటీవల బాచుపల్లికి తరలిన యూనివర్సిటీ పరిపాలనా యంత్రాంగం నాంపల్లి ప్రాంగణాన్ని పట్టించుకోకపోవడం వల్ల తరచు సమస్యలు తలెత్తుతున్నాయి. నృత్య భారతి బాలోత్సవ్ కార్యక్రమం జరుగుతున్న సమయంలో శనివారం పగటి పూట గంటల తరబడి విద్యుత్ నిలిచిపోయి జనరేటర్ పనిచేయక ఆడిటోరియంలో చిమ్మచీకట్లు నెలకొనగా, దీంతో కార్యక్రమానికి తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో కళాకారులు, నిర్వాహకులు, వీక్షకులు తెలుగు వర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల ముందుగానే ఆడిటోరియాన్ని కార్యక్రమ నిర్వహణ కోసం బుక్ చేసుకున్నామని సమయానికి విద్యుత్ అంతరాయానికి తోడు జనరేటర్ పనితీరును పరిశీలించుకోకుండా తమకు తీవ్ర ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ కోతలకు తోడు తెలుగు వర్సిటీ అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా లోపం కార్యక్రమాల నిర్వహణ సంస్థలు వర్సిటీ ఆడిటోరియంలో కార్యక్రమాలను కొనసాగించేందుకు ఆసక్తి చూపకపోవచ్చు.

టెక్సాస్ వైద్యుల బృందం@నిమ్స్

ఖైరతాబాద్, నవంబర్ 9: నిమ్స్ దవాఖానను టెక్సాస్ వైద్యుల బృందం శనివారం సందర్శించింది. టెక్సాస్‌లోని సౌత్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఎమర్జెన్సీ ఫిజీషియన్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యుల బృందం నిమ్స్‌లోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. భవిష్యత్తులో సౌత్ వెస్టర్న్ యూనివర్సిటీ, నిమ్స్‌తో కలిసి పనిచేస్తుందని, వైద్యపరంగా పరస్పర సహకారం అందించుకుంటాయని టెక్సాస్ వైద్య బృందం తెలిపింది.

ప్రోత్సాహాన్ని ఇచ్చేవే.. పురస్కారాలు

ప్రముఖ నాట్య గురువు డాక్టర్ తాళ్లపాక సందీప్ కుమార్

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 9: పురస్కారాలు సమాజంలో గుర్తింపుతో పాటు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని ప్రముఖ నాట్యగురువు డాక్టర్ తాళ్లపాక సందీప్ కుమార్ అన్నారు. విశ్వ ఆర్ట్స్, ఆర్.కె. కళా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో కార్తీక మాసం నాట్య ఉత్సవం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పలువురు కళాకారులకు పురస్కారాలను అందజేసి సత్కరించారు. ప్రముఖ గాయని వేమూరి మంజులకు సంగీత శిరోమణి, ప్రముఖ కవి వేమూరి అనంత రామకృష్ణ శర్మకు సాహిత్య శిరోమణి పురస్కారాన్ని బహూకరించారు. ఆర్.కె. కళా ఫౌండేషన్ నిర్వాహకులు రంజిత్ కుమార్, కళా పోషకులు డాక్టర్ చిల్లా రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎన్.బిక్కునాథ్ నాయక్, రజనీకాంత్, ప్రతాప వంశీ, పలువురు కళాకారులు, కళాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని రూ.1.51 లక్షల ఔషధాలు సీజ్

స్వాధీనం చేసుకున్న మందులతో నిందితులు

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు నిలువ చేసిన ఇంటిపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.1.51లక్షల విలువజేసే 54 రకాల మందులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డీసీఏ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన బచ్చు సాయిచరణ్ డీసీఏ అనుమతి లేకుండా యాంటిబయోటిక్స్, స్టిరాయిడ్స్ తదితర ఔషధాలను విక్రయించేందుకు ఇంట్లో నిలువ ఉంచాడు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు సాయిచరణ్ ఇంటిపై దాడులు జరిపి రూ.1.51లక్షల విలువజేసే 54రకాల ఔషధాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మరో కేసులో ‘ముక్త వాటి ఎక్స్‌ట్రా పవర్ టాబ్లెట్స్’పై నిబంధనలకు విరుద్ధంగా హై బ్లడ్‌ప్రెషర్ నియంత్రణ కోసం అంటూ ప్రకటన ముద్రించారు. డీసీఏ నిబంధనల ప్రకారం ఔషధాలపై చికిత్స పేరు అంటే ఈ చికిత్స కోసం పనిచేస్తుందని పేర్కొనడం నేరం. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు చికిత్స పేరుతో ప్రకటనలు ముద్రించిన ఔషధాలను సీజ్ చేశారు.

ఓయూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్ శ్రీను

పురుషులు, మహిళల 800 మీటర్ల పరుగులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బంగారు పతకాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి నవంబర్ 9: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను శ్రీను సొంతం చేసుకున్నారు. ఓయూ సింథటిక్ ట్రాక్‌లో శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పురుషుల 800 మీటర్ల ఫైనల్ పరుగులో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కే.శ్రీను 1:56:7 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పథకాన్ని సొంతం చేసుకోగా, దోమల్‌గూడ జీసీపీఈ కళాశాల విద్యార్థి కే.కిరణ్ 2:02:8 సెకండ్లలో పూర్తి చేసి రజితం, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి టి.ప్రకాశ్ 2:14:6 సెకండ్లలో పూర్తి చేసి కాంస్య పతకాలను దక్కించుకున్నారు. మహిళల 800 మీటర్ల పరుగులో కే.స్వప్న (ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), టి.ప్రియాంక (దోమల్‌గూడ జీసీపీఈ కళాశాల), ఎన్.విజయలక్ష్మి (శివాని డిగ్రీ కళాశాల)లు మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.నరేశ్ రెడ్డి, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్, ఓయూ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సునీల్ కుమార్, బిఓసీ కార్యదర్శి కే.దీప్లా తదితరులు ట్రోఫీని అందజేశారు.

ది 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కొండాపూర్, నవంబర్ 9: డిజైన్ టెక్నాలజీ రంగంలో సృజనాత్మకతను, సహకార వృద్ధిని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నాలెడ్జ్ సిటీలోని టీ – హబ్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న ‘ది 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్’ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, డిజైన్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని, డిజైన్ రంగంలో సృజనాత్మకతను జతపరిచి మరిన్ని అద్భుతాలను ఆవిష్కరించాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాల సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిజైన్ రంగం విద్యార్థులు, ఇండస్ట్రీ నిపుణులు, మెంటర్లు పాల్గొన్నారు.

కార్తీక మాసం.. శివాలయ దర్శనం!

ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సు సేవలను ప్రారంభించింది. ఈ మాసంలో శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోతుంటాయి. ప్రతి భక్తుడు కుటుంబ సమేతంగా శివాలయానికి వెళ్లి ఆ పరమేశ్వరుడిని దర్శనం చేసుకుంటారు. అందులో భాగంగా ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంచారామాలు అమరావతి (అమరేశ్వరాలయం), భీమవరం (సోమేశ్వరాలయం), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరాలయం), సామర్లకోట (కుమార రామం)కు బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచారు. ఈ సర్వీసులు ప్రతి ఆదివారం ప్రారంభమవుతాయి. నవంబర్ 10, 17, 24, డిసెంబర్ 1న బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం. 040-2345 0033 / 040-6944 0000లలో సంప్రదించొచ్చని పేర్కొన్నారు. టీజీఎస్‌ఆర్టీసీబీయూఎస్ అనే వెబ్‌పోర్టల్‌లో సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. దీంతో పాటు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలానికి సైతం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లాల్లో నుంచి సైతం అరుణాచలానికి బస్సులు అందుబాటులో ఉంచినట్టు వివరించారు. కాణిపాకం, వెల్లోర్ గోల్డెన్ టెంపుల్, అరుణాచలం ఇలా రూట్ మ్యాప్ ఉండనుందని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల మౌనదీక్ష

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 9: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల జేఏసీ కొంత కాలంగా నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. ఆందోళనలో భాగంగా యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, ఆధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మౌనదీక్షకు దిగారు. యూనివర్సిటీకి నష్టం కలిగించే ప్రభుత్వ నిర్ణయంపై వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వచ్చి సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, డా. రవీంద్రనాథ్ సొలమన్, డా.పి.వేణుగోపాల్ రెడ్డి, ప్రొ. జి.పుష్పా చక్రపాణి, నేతలు డా.ప్రమీల కేతావత్, డా.బి.శ్రీనివాస్, రజినీకాంత్, రాములు, డా.జి.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సెక్స్ రాకెట్ గుట్టురట్టు

ఇద్దరు నిర్వాహకులతో సహా ఓ విటుడి అరెస్ట్

పట్టుబడిన ముగ్గురు మహిళలు స్టేట్‌హోంకు తరలింపు

సిటీబ్యూరో, నవంబర్ 9(నమస్తే తెలంగాణ): నగరంలో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న సెక్స్ రాకెట్ గుట్టును యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయూ), ఉమెన్ సేఫ్టీవింగ్(డబ్ల్యూఎస్‌డబ్ల్యూ) పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో వ్యభిచారం నిర్వహిస్తున్న భార్యాభర్తలతోపాటు ఒక విటుడిని అరెస్ట్ చేశారు. వ్యభిచారం చేస్తున్న ముగ్గురు మహిళలను స్టేట్‌హోమ్‌కు తరలించారు. ఉమెన్ సేఫ్టీవింగ్ ఇన్‌చార్జ్ డీసీపీ ధార కవిత కథనం ప్రకారం... బంగ్లాదేశ్‌కు చెందిన సలీమ్ మండల్(36), మరియా ఇంచెన్(27) దంపతులు గత కొంతకాలం కిందట నగరానికి వచ్చి నార్సింగి, పుప్పాలగూడలోని ట్రాంక్విల్ అడోడ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్నారు. వీరు సుమన్‌కుమార్ గురు అలియాస్ రవి కుమార్ అనే వ్యక్తి ద్వారా బంగ్లాదేశ్ తదితర విదేశాల నుంచి అమాయక యువతులు, మహిళలను ఉపాధి పేరుతో నగరానికి తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నారు. ఈ క్రమంలో లక్డీకాపూల్‌ని హోటల్ అక్షయలో గత కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఏహెచ్‌టీయూ, డబ్ల్యూఎస్‌డబ్ల్యూ విభాగాల పోలీసులు సంయుక్తంగా హోటల్‌పై దాడులు జరిపారు. ఈ దాడుల్లో హోటల్‌లోని రూమ్ నం.104, 204లో ఉన్న ముగ్గురు సెక్స్ వర్కర్లతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వ్యభిచారం నిర్వహిస్తున్న సలీమ్ మండల్, మరియా దంపతులు, విటుడు నడిపుడి నాగ నర్సింహబాబులను అరెస్టు చేశారు. ముగ్గురు సెక్స్ వర్కర్లను పునరావాస కేంద్రానికి తరలించారు.

12న తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 9: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022వ సంవత్సరానికి గాను తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పుస్కారాలను ఈ నెల 12న యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్రదానం చేయనున్నారు. పెండ్యాల కిషన్ శర్మ పద్య కవిత వరదాభ్యుదయము, మెర్సీ మార్గరేట్ వచన కవిత కాలం వాలిపోతున్న వైపు, ఎన్నవెల్లి రాజమౌళి బాల సాహిత్యం ఆటా-పాటా, కొట్టం రామకృష్ణారెడ్డి కథ, కథానిక ప్రక్రియ నూనె సుక్క, డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ నవల కెరటం, ఆచార్య వెల్దండ నిత్యానందరావు సాహిత్య విమర్శ ప్రక్రియ గ్రంథం అనుభూతి-అన్వేషణ, పీప దేవి నాటకం స్వాతంత్రోద్యమ వీరుల నాటక త్రయం, గురుమూర్తి గుబిలి అనువాద గ్రంథం వీరయ్య, సయ్యద్ నశీర్ అహమ్మద్ వచన రచన ప్రక్రియ ఆజాద్ హింద్ ఫౌజ్-ముస్లిం పోరాట యోధులు, డాక్టర్ చాగంటి తులసి గ్రంథం ‘రంగంటే ఇష్టం’ పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ. 20,116 నగదుతో పాటు పురస్కార పత్రంతో సత్కరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి, తెలుగు వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య టి.కిషన్ రావు తదితరులు పాల్గొననున్నారు.